సర్కార్ మెడలు వంచిన బీఆర్ఎస్

- కులగణన తప్పుల తడక అని మొదటినుంచీ చెప్తున్న బీఆర్ఎస్
- ఓ సర్వే జరపాలంటూ ఒత్తిడి.. ఎట్టకేలకు తలొగ్గిన ప్రభుత్వం
- మిగిలిన కొంతమందికి కాదు.. పూర్తిగా ఓ సర్వే చేయాలి
- బీసీలకు క్షమాపణలు చెప్పాలి: పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఇంటింటికీ పంపాలి: వద్దిరాజు
- సమగ్రంగా చేపట్టాలి: తలసాని
- కులగణన బోగస్ అని తేలిపోయింది: పెద్ది సుదర్శన్
- ఈ సారైనా నిష్పక్షపాతంగా చేపట్టాలి: కిశోర్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ మొదటినుంచీ హెచ్చరించినట్టే జరిగింది. కాంగ్రెస్ సర్కార్ వెల్లడించిన కులగణన సర్వే నివేదిక తప్పులతడక అని తేటతెల్లమైంది. బీసీ జనాభా ఏటికేడు పెరగాలి గానీ ఎలా తగ్గుతుందని బీఆర్ఎస్ ప్రశ్నించింది. అసమగ్రంగా, అశాస్త్రీయంగా నిర్వహించిన సర్వేను వ్యతిరేకించింది. కులగణన, బీసీ రిజర్వేషన్ల అంశాలపై సర్వే నివేదికను వెల్లడించిన నాటి నుంచే నిరసన తెలిపింది. నివేదిక లోపభూయిష్టంగా ఉన్నదని ఆక్షేపించింది. మళ్లీ సర్వే చేయాలని డిమాండ్ చేసింది. బీఆర్ఎస్ న్యాయమైన డిమాండ్‌కు సర్కారు తలొగ్గింది. కులగణనకు రీసర్వే చేపడతామని ఎట్టకేలకు ప్రకటించింది. బుధవారం రాత్రి సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ విషయాన్ని వెల్లడించారు. కులగణనలో వివరాలు ఇప్పటివరకు నమోదు చేసుకోనివారు ఈ నెల 16 నుంచి 28 వరకు మూడు పద్ధతుల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. భట్టి ప్రకటనతో కులగణన సర్వే అసమగ్రంగా ఉన్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకున్నట్టు అయింది. కొంత మందికే కాకుండా మళ్లీ పూర్తిగా కులగణన సర్వే చేపట్టాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తున్నది. బీసీల జనాభాను తగ్గించి వెనకబడినవర్గాల ప్రజలను తీవ్ర మానసిక వేదనకు గురిచేసినందుకు తొలుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని బీసీలందరికీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కోరుతున్నది.

ముమ్మాటికీ తప్పేనని అంగీకరించాలి: కేటీఆర్

కులగణన సర్వే తప్పులతడక అని రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఒప్పుకోవడాన్ని స్వాగతిస్తున్నట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తెలిపారు. బీసీ జనాభాను తగ్గించి వెనకబడినవర్గాల ప్రజలను తీవ్ర మానసిక వేదనకు గురిచేసినందుకు ముఖ్యమంత్రి రాష్ట్రంలోని బీసీలందరికీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అసమగ్రంగా చేసిన సర్వేపై బీఆర్ఎస్‌తోపాటు బీసీ సంఘాలు ముక్తకంఠంతో అభ్యంతరం వ్యక్తంచేసినా వినకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తి లెక్కల ఆధారంగా అసెంబ్లీలో తీర్మానం చేయడం కూడా ముమ్మాటికీ తప్పేనని అంగీకరించాలని హితవుపలికారు. రెండోసారి సర్వేనైనా సమగ్రంగా చేయడంతోపాటు బీసీలకు చట్టబద్ధంగా 42% రిజర్వేషన్లు కల్పించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బుధవారం ఎక్స్ వేదికగా కేటీఆర్ డిమాండ్ చేశారు. తూతూమంత్రంగా తీర్మానం చేసి, బీసీ రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం పరిధిలోకి నెట్టి చేతులు దులుపుకుందామంటే మాత్రం బీఆర్ఎస్‌తోపాటు బీసీ సంఘాలు ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన మాటను సంపూర్ణంగా నిలబెట్టుకునే వరకూ కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలోని బీసీలెవరూ నమ్మే పరిస్థితిలో లేరనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుపెట్టుకుంటే మంచిదని హితవు పలికారు.

కులగణన బోగస్ అని తేలిపోయింది: పెద్ది సుదర్శన్‌రెడ్డి

కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన కులగణన బోగస్ అని తేలిపోయిందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై క్లారిటీ లేకుండానే రాష్ట్రంలో ఉత్సవాలు ఎందుకు నిర్వహించినట్టు అని నిలదీశారు. పరిపాలన అనుభవం లేక, స్వతహాగా ఆలోచించే పరిణితి లేక కులగణన చేపట్టి అత్యుత్సాహంతో కాంగ్రెస్ తప్పటడుగు వేసిందని బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తిరగబడతారనే భయంతో తామే చట్టం చేస్తామని, కేంద్రానికి పంపుతామని కాలయాపన చేస్తూ, ఎన్నికలను వాయిదా వేస్తూ వస్తున్నదని మండిపడ్డారు.

బీఆర్ఎస్ పోరాటంతోనే ఓ సర్వే : గోసుల శ్రీనివాస్‌యాదవ్

బీఆర్ఎస్ పార్టీ సాగించిన పోరాటంతోనే రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి కులగణన రీసర్వే చేపడుతున్నదని బీఆర్ఎస్ నేత గోసుల శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. ఇప్పటికైనా శాస్త్రీయంగా బీసీ జనగణన నిర్వహించాలని డిమాండ్ చేశారు.

మళ్లీ సమగ్ర కులగణన చేపట్టాలి: తలసాని శ్రీనివాస్‌యాదవ్

రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ సమగ్రంగా, శాస్త్రీయంగా కులగణన చేపట్టాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం సర్వే నివేదికను ప్రకటించిన నాటినుంచి తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. అసెంబ్లీలో సైతం జనాభా గణాంకాలతో సహా వివరించానని తెలిపారు. అసమగ్రంగా ఉన్న సర్వే నివేదికను పూర్తిగా ఉపసంహరించుకొని శాస్త్రీయంగా మళ్లీ మొదటినుంచి రాష్ట్రవ్యాప్తంగా సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. కులగణన సర్వేలో వివరాలు నమోదు చేసుకోనివారు మాత్రమే తమ వివరాలను రీసర్వేలో చెప్పాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా ద్వారా చెప్పడాన్ని తలసాని ఖండించారు.

ఈసారైనా ఇంటింటికీ పంపాలి: వద్దిరాజు

కులగణన సర్వే అశాస్త్రీయంగా జరిగిందని, తప్పులతడకగా ఉన్నదని తమ పార్టీ లెక్కలతోసహా నిరూపించడంతో రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి రీసర్వేకు అంగీకరించడాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర స్వాగతించారు. ఈ సారైనా ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి పూర్తి వివరాలు సేకరించాలని, వాటన్నింటినీ క్రోడీకరించి సరైన లెక్కలు వెల్లడించాలని ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓబీసీలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్లు కల్పించడంతోపాటు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రం ఏర్పాటైన తొలినాళ్లలోనే ఈమేరకు కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేయించారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ తీర్మానానికి అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ప్రధాని మోదీ వద్దకు తీసుకెళ్లి చట్టసభల్లో 33%, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ఆమోదింపజేసేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించాలని కోరారు. రాష్ట్ర మంత్రిమండలిలో ఖాళీగా ఉన్న ఆరు స్థానాల్లో నాలుగింటిని బీసీలకిచ్చి ప్రాధాన్య శాఖలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

గందరగోళం.. అయోమయం

- ఇప్పటికే సర్కార్‌కు అందిన డెడికేటెడ్ కమిషన్ నివేదిక
- ఇప్పుడు రీ సర్వే చేస్తామని ప్రభుత్వం ప్రకటన
- ఆ నివేదికను పరిగణనలోకి తీసుకుంటారా? లేదా?
- స్పష్టతనివ్వని ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ఇంటింటి సర్వే, బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ అంశం గందరగోళంగా మారింది. ప్రభుత్వం హడావుడిగా తీసుకుంటున్న నిర్ణయాలతో అయోమయ పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికే బీసీ రిజర్వేషన్లకు సంబంధించి డెడికేటెడ్ కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. తాజాగా ప్రభుత్వం మరోవైపు రీ సర్వే నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే, ఇప్పటికే డెడికేటెడ్ కమిషన్ సమర్పించిన నివేదికను పరిగణనలోకి తీసుకుంటారా? లేదంటే మరోసారి తాజా గణాంకాల ఆధారంగా నివేదికను తెప్పించుకుంటారా? అనే విషయంలో ప్రభుత్వం స్పష్టతనివ్వలేదు. సర్వేలో పాల్గొనని 3.1% జనాభాకే అవకాశం కల్పిస్తామని ప్రకటించింది. కానీ, క్షేత్రస్థాయిలో అంతకు నాలుగింతల మంది పాల్గొనలేదని తెలుస్తున్నది.

3.1% జనాభాకేనా?

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో గత నవంబర్‌లో ఇంటింటి సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల)ను నిర్వహించింది. సర్వే నివేదికను అసెంబ్లీలో ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలో మొత్తంగా 3.7 కోట్ల మంది జనాభా ఉండగా, అందులో 3,54,77,554 (96.9%) మందిని సర్వే చేసి వివరాలు సేకరించామని తెలిపింది. 3.1% కుటుంబాల వివరాలను సేకరించలేదని మంత్రి వెల్లడించారు. 1.03 లక్షల ఇండ్లకు తలుపులు వేసి ఉండటం, 1.68 లక్షల కుటుంబాలు మొదట్లో పాల్గొనడానికి సంకోచించడం, 84,137 ఇండ్లు నివాసేతరంగా ఉండటం వంటి సమస్యలు ఎదురయ్యాయని తెలిపారు. మొత్తంగా 16 లక్షల జనాభా వివరాలను సేకరించలేదని పేర్కొన్నారు. ఈ సర్వే ప్రకారం బీసీలు 1,64,09,179 (46.25%), బీసీ ముస్లింలు 35,76,588 (10.08%), ఎస్సీలు 61,84,319 (17.43%), ఎస్టీలు 37,05,929 (10.45%), ఓసీ ముస్లింలు 8,80,424 (2.48%), ఇతర ఓసీలు 44,21,115 (13.31%) ఉన్నట్టు నివేదించింది. సర్వే మొత్తం తప్పుల తడకగా కొనసాగిందని బీసీ సంఘాలు ఆది నుంచీ అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. ఓటరు జాబితా ప్రకారం రాష్ట్రంలో 3.29 కోట్ల మంది ఉండగా, రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ గణాంకాల ప్రకారం 1.25 కోట్ల ఇండ్లు ఉన్నాయని, 2022 ఆధార్‌కార్డు లెక్కల ప్రకారం 3.89 కోట్ల మంది ఉన్నారని, మరి ప్రభుత్వం కేవలం 3.7 కోట్ల మందే ఉన్నారని ఎలా లెక్క తేల్చిందని నిలదీస్తున్నారు. మరోసారి సర్వే చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఎట్టకేలకు దిగివచ్చిన ప్రభుత్వం సైతం తాజాగా రీ సర్వేకు అంగీకరించింది. అయితే సర్వేలో పాల్గొనని వారికే అంటే 3.1% జనాభాకే అవకాశం కల్పిస్తామని ప్రకటించింది. కానీ, క్షేత్రస్థాయిలో సంచార జాతులు, వలసపోయినవారితో కలిపి అంతకు నాలుగింతలకుపైగా జనాభా వివరాలు నమోదు చేసుకోలేదని బీసీ, కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. కానీ ప్రభుత్వం మాత్రం వివరాలను నమోదు చేసుకొని 16 లక్షల జనాభాకే అవకాశం కల్పిస్తామని ప్రకటించడంపై మళ్లీ సందిగ్ధత నెలకొన్నది. ఆ మేరకు వివరాలను నమోదు చేసి మమ అనిపిస్తుందా? లేదంటే నమోదు చేసుకునే అందరి వివరాలను నివేదికలో చేర్చుతుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రీసర్వే చేయించకుండా ఇప్పటివరకు వివరాలు నమోదుచేసుకోని వారికి అవకాశం కల్పిస్తామని ప్రకటించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికే సర్కార్‌కు డెడికేటెడ్ కమిషన్ నివేదిక

ప్రభుత్వం కులగణన వివరాలను ఈ నెల 4న అసెంబ్లీ వేదికగా ప్రకటించింది. ఆ వెనువెంటనే నివేదికను డెడికేటెడ్ కమిషన్‌కు అందజేసింది. ఇంటింటి సర్వే గణాంకాలను ఆధారంగా చేసుకుని కమిషన్ సైతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను స్థిరీకరించింది. అందుకు సంబంధించిన నివేదికను డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి ఇటీవలనే అందజేశారు. సుప్రీంకోర్టు నిబంధనల మేరకు 50% సీలింగ్‌కు లోబడే రిజర్వేషన్లను ఖరారు చేసినట్టు తెలిసింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఇంటింటి సర్వేలో పాల్గొనని వారికి మరోసారి అవకాశం ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం.. ఇప్పటికే డెడికేటెడ్ కమిషన్ సమర్పించిన నివేదికపై ఎటువంటి ప్రకటన చేయలేదు. ఈ నివేదికను పరిగణనలోకి తీసుకుంటారో, లేదో స్పష్టతనివ్వలేదు. తాజాగా రీ సర్వే నిర్వహించిన అనంతరం క్రోడీకరించే గణాంకాలను డెడికేటెడ్ కమిషన్‌కు అందజేసి, మరోసారి నివేదిక తెప్పించుకుంటామన్న అంశాన్ని కూడా ప్రకటించలేదు.

రిజర్వేషన్ చట్టం తెచ్చి ఎన్నికలు పెట్టండి

- అలా చేస్తే మా పూర్తి మద్దతు
- కోర్టుకు వెళ్లినా నష్టముండదు
- కులగణన, ఎస్సీ, డెడికేటెడ్ కమిషన్ల నివేదికలను అసెంబ్లీ, కౌన్సిల్‌లో పెట్టాలి
- చిట్‌చాట్‌లో ఎమ్మెల్సీ కవిత
- పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తే కమిషన్లు ఎందుకని ప్రశ్న

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం చట్టం తెచ్చి వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇలా చేస్తే తాము మద్దతు ఇస్తామని, ఎవరు కోర్టుకు వెళ్లినా ఎలాంటి నష్టం ఉండబోదని చెప్పారు. పార్టీ పరంగా రిజర్వేషన్లు అంటే బీసీలకు అన్యాయం చేయడమేనని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కచ్చితంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని, అందులో కూడా మహిళలకు సగం సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నివేదికలోని అంశాలు సెలెక్టివ్‌గా తీసుకుంటామంటే కుదరదని ఆక్షేపించారు. కులగణన, ఎస్సీ కమిషన్, డెడికేటెడ్ కమిషన్ నివేదికలను పూర్తిగా అసెంబ్లీ, కౌన్సిల్‌లో పెట్టాలని పునరుద్ఘాటించారు. బంజారాహిల్స్‌లోని తన నివాసంలో బుధవారం మీడియా చిట్‌చాట్‌లో ఆమె మాట్లాడారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే అసెంబ్లీలో చట్టం చేయాలని సూచించారు. కులగణన సర్వేలో మూడు శాతానికిపైగా ప్రజలు పాల్గొనలేదని ప్రభుత్వం అంటున్నందున, పాల్గొనని వారికి సర్వేలో పాల్గొనే అవకాశం ఇవ్వాలని సూచించారు. మొత్తానికి మొత్తం రీ సర్వే అంటే కాంగ్రెస్ సర్కారు రిజర్వేషన్లు ఇవ్వకుండా తప్పించుకునే ప్రమాదం ఉంటుందని చెప్పారు. కౌన్సిల్‌లో వాకౌట్ విషయంలో కొంత అయోమయం నెలకొన్నదని, వాదన బలంగా వినిపించాలనే తనతోపాటు కొంతమంది ఎమ్మెల్సీలంతా సభలోనే ఉన్నామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చట్టపరంగా అమలు చేసేందుకు సుప్రీంకోర్టులో అనుభవం ఉన్న లాయర్‌ను పెట్టి కొట్లాడితే తమిళనాడు తరహా రిజర్వేషన్ రావడానికి అవకాశం ఉన్నదని తెలిపారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను ఎగ్గొట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని, పార్టీ పరంగా ఇవ్వడానికి కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఎందుకు? డెడికేషన్ కమిషన్ ఎందుకు? అని ప్రశ్నించారు. ఖమ్మం, కొత్తగూడెంలో జాగృతి ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

అభివాదం చేస్తున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ నేతలు వేముల మదన్‌మోహన్, లాలుకోట వెంకటాచారి, చొల్లేటి కృష్ణామాచార్యులు

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

- మళ్లీ రాష్ట్రంలో కులగణన సర్వే జరపాలి
- విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం

రవీంద్రభారతి, ఫిబ్రవరి12: రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టబద్ధత కల్పించాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం రాష్ట్ర నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తప్పుల తడకగా మారిన కులగణన సర్వేను మళ్లీ జరపాలని కోరారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణామాచార్యులు, కోశాధికారి రాగిఫణి రవీంద్రాచారి మాట్లాడారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతీయులకు రాష్ట్ర బీసీ కమిషన్, ప్లానింగ్ బోర్డు తీరని ద్రోహం చేశాయని విమర్శించారు. బీసీ జనాభా పెరగాల్సింది పోయి తగ్గడమేమిటని ప్రశ్నించా రు. సంఘం ఉపాధ్యక్షుడు పలిగిళ్ల శ్రీనివాసాచారి, నారోజు జగ్‌జీవన్, మారోజు సుదర్శనాచారి, పెద్ద కొలిమి బ్రహ్మాచారి, దేవరకొండ వీరాచారి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పబ్బోజు భిక్షపతి, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీరామాచారి, ఆర్ విష్ణుచారి పాల్గొన్నారు.

42% కోసం సర్కార్‌పై యుద్ధమే

- 'స్థానిక'లో మా వాటా మాకివ్వాలి
- పార్టీలపరంగా రిజర్వేషన్లు వద్దు
- రిజర్వేషన్ చట్టబద్ధతపై తాత్సారం చేయడం మంచిదికాదు
- మేధోమదన సదస్సులో జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వీ ఈశ్వరయ్య, బీసీ నేతలు

హైదరాబాద్‌లో నిర్వహించిన మేధోమదన సదస్సులో మాట్లాడుతున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, బీసీ నేత వకులాభరణం కృష్ణమోహన్

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తేతెలంగాణ): స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల పెంపు విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తే బీసీలు మూకుమ్మడిగా యుద్ధం ప్రకటించాలని జాతీయ వెనకబడిన తరగతుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వీ ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. పార్టీలపరంగా కల్పించే రిజర్వేషన్లు వద్దని, చట్టప్రకారమే బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో బుధవారం ఏర్పాటుచేసిన 'కులగణన సర్వే-రిజర్వేషన్లు పూర్వాపరాలు-సమస్య-ఆందోళనకర అంశాలు-పరిష్కార మార్గాలు' అనే అంశంపై నిర్వహించిన మేధోమదన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. 'మేమెంతో మాకంత' వాటా దక్కాలంటే బీసీలను క్షేత్రస్థాయిలో చైతన్యపర్చాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. బీసీలు తమ ప్రాతినిధ్యాన్ని రిజర్వేషన్ల రూపంలో అడుగుతున్నారని తెలిపారు. ఆర్టికల్ 15, 16 ప్రకారం బీసీలకు న్యాయమైన వాటా దక్కాల్సిందేనని స్పష్టంచేశారు. సుప్రీంకోర్టు బీసీలకు 27% రిజర్వేషన్లు ఇవ్వాలని స్పష్టం చేసినా.. తప్పుడు విధానాలతో క్రీమీలేయర్ అమలు చేసి బీసీల వాటాను సైతం పాలకులు లాక్కున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిపుణుల కమిటీని నియమించి రాష్ట్రంలో సమగ్రంగా బీసీల లెక్కలు తేల్చాలని డిమాండ్ చేశారు. తమిళనాడులో ఏ కులగణన జరగకున్నా చట్టం చేశారనిగుర్తు చేశారు. చట్టం చేయడానికి బీసీల జనాభా 50% ఉంటే చాలని తేల్చిచెప్పారు. బీసీ రిజర్వేషన్లపై ఉద్యోగులు, విద్యార్థుల్లో చైతన్యం వచ్చిందని రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, వివిధ బీసీ సంఘాల నేతలు దేవళ్ల సమ్మయ్య, సతీశ్ కొట్టె, వినోద్ కురవ, టీ తుల్జారాంసింగ్, ప్రొఫెసర్లు విశ్వేశ్వరరావు, ఐ తిరుమలి, ఎన్ సింహాద్రి, పీ నరేంద్రబాబు, ఎస్ రాధాకృష్ణ, ఏఐబీసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్ గౌడ్, సెక్రటరీ ప్రొఫెసర్ సుదర్శన్‌రావు, బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగెం సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన చేపట్టాలి: వకులాభరణం

రాష్ట్రంలో చేపట్టిన కులగణన సర్వే తప్పులతడకలా మారిందని, బీసీలకు న్యాయం జరగాలంటే వెంటనే రీసర్వే చేయాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. సర్వే నిర్వహించిన ప్రణాళిక శాఖలోనే సమన్వయం లేదని, గందరగోళంగా ప్రశ్నలను తయారు చేశారని విమర్శించారు. సర్వే లెక్కలు తీస్తే 40 లక్షల మంది బీసీలు గల్లంతయ్యారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేసి సర్వేలో పాల్గొనని వారి వివరాలను సేకరించాలని సూచించారు.

సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు లెక్కలు: జాజుల

కులగణన సర్వే పేరిట సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా తప్పుడు లెక్కలను ప్రవేశపెట్టారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన 64 మంది ఎమ్మెల్యేల్లో కేవలం ఏడుగురు మాత్రమే బీసీలు ఉన్నారని చెప్పారు. ఎంపీ ఎన్నికల సమయంలో ఆరు గురు బీసీలకు సీట్లు కేటాయిస్తామన్న కాంగ్రెస్.. కేవలం ముగ్గురికి మాత్రమే కేటాయించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం అగ్రకులాలకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వడంతో ఆ పార్టీలకు బీసీలపై ఉన్న చిత్తశుద్ధి ఏ పాటిదో తేలిపోయిందని ధ్వజమెత్తారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీ బిడ్డలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

లోపభూయిష్టంగా సర్వే: మురళీమనోహర్

రాష్ట్రప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే లోపభూయిష్టంగా ఉన్నదని ప్రొఫెసర్ మురళీమనోహర్ విమర్శించారు. సర్వేలో బీసీల సంఖ్యను తక్కువ చేసి చూపారని మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వం కులగణన సర్వేలోని తప్పులను సవరించాలని డిమాండ్ చేశారు. నిపుణుల కమిటీ వేసి డాటాను సరిచేయాలని సూచించారు. కులగణన జరగని చోట రీ సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

కులగణన పేరిట మోసం: సతీశ్ కొట్టె

కులగణన సర్వే పేరిట బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు సతీశ్ కొట్టె ధ్వజమెత్తారు. గ్రామీణ స్థాయి నుంచి బీసీ రిజర్వేషన్లపై ఉద్యమం ప్రారంభం కావాల్సి ఉన్నదని పిలుపునిచ్చారు. కులగణనపై శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని, ప్రభుత్వం ఆగమేఘాల మీద ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు.

18న ఆఫీసుల ముట్టడికి బీసీలు సిద్ధం

- మళ్లీ కులగణన చేపట్టాలి
- 42% రిజర్వేషన్లకు కచ్చితంగా చట్టబద్ధత కల్పించాల్సిందే..
- ఆ తర్వాతే స్థానిక ఎన్నికలు
- పార్టీపరంగా ఇస్తామంటే మేం బిచ్చగాళ్లమా?
- ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య

రవీంద్రభారతి, ఫిబ్రవరి12: కులగణన సర్వే మళ్లీ జరపాలని, స్థానిక ఎన్నికల్లో 42% రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని, ఆ తర్వాతే ఎన్నికలు జరపాలనే డిమాండ్‌తో ఈ నెల 18న రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలను బీసీలు ముట్టడించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టరేట్లు, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడించి, ధర్నాలు, నిరసన దీక్షలు చేపట్టాలని కోరారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన బీసీ నేతల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం బీసీలకు 42% రిజర్వేషన్లను చట్టపరంగా కల్పించాలి తప్ప, పార్టీపరంగా ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. పార్టీ పరంగా ఇచ్చేందుకు మేమేమైనా బిచ్చగాళ్లమా? అని నిలదీశారు. 'రాజ్యాంగం ప్రకారం మా వాటా మాకిచ్చి తీరాల్సిందే.. లేకుంటే రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తామని హెచ్చరించారు. బీసీ భవన్‌లో 14 బీసీ సంఘాలు 30 కులసంఘాలతో కలిసి రిజర్వేషన్లపై చర్చించామని తెలిపారు. గత సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి రిజర్వేషన్లకు మొండిచేయి చూపు తామంటే సహించబోమని స్పష్టంచేశారు. వెంటనే సీఎం అఖిలపక్షం సమావేశాన్ని ఏర్పాటుచేసి అన్ని పార్టీల నిర్ణయాలను తెలుసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలకు అన్యాయం తలపెడితే కాంగ్రెస్ ప్రభుత్వం అంతుచూస్తామని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. బీ